సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం । 23 । జూన్ । 2023



తాగునీటి సమస్యకు చెక్

జడ్చర్ల మున్సిపాలిటీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

వివరాలు 9లో ▸



మెరుగైన సేవలే లక్ష్యం

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఈడీ పురుషోత్తం అన్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
37.1 /22.2

వాతావరణం

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

అచ్చంపేట రూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడిపిస్తున్నామని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అచ్చంపేట ఆర్టీసీ డీఎం రాజశేఖర్ కోరారు. ఈ క్రమం లో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డిపో కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారులు తమ సందేహాలు, సూచనలను సెల్ నం.99592 26291కు కాల్ చేసి తెలపాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

నాగర్‌కర్నూల్ క్రైం: దళితబంధు లబ్ధిదారులు తమ వాహనాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో అద్దెకు వినియోగించుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 అద్దె వాహనాలు ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో 9 నెలల పాటు కాంట్రాక్టు పద్ధతిన అద్దెకు తీసుకోనున్నారన్నారు. ఇందుకు గాను శుక్రవారం నుంచి ఈ నెల 26 వరకు దళితబంధులో వాహనాలు పొందిన లబ్ధిదారులు తమ దరఖాస్తులను డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతా రామచంద్రస్వామి ఆలయ ఆవరణలో గుట్ట దిగువన ఉన్న 327, 328 సర్వే నంబర్లలో 17 మంది అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, వెంటనే వాటిని ఆపాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని గురువారం ఆలయ చైర్మన్ రామశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ భూమిని ఆక్రమిస్తుండటంతో హైకోర్టులో పిటిషన్ వేయడంతో కోర్టు అక్రమ నిర్మాణాలు ఆపాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దేవాలయ భూమిలో ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ రామశర్మ, ఈఓ రఘు హెచ్చరించారు.

27న క్విజ్ పోటీలు

నాగర్‌కర్నూల్ క్రైం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఆలిండియా క్విజ్ ఆన్ ఫైనాన్స్ లిట్రసీ–2023 కార్యక్రమం లీడ్ బ్యాంకు మేనేజర్ కార్యాలయం ద్వారా మండల, జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని డీఈఓ గోవిందరాజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక లావాదేవీలు, సైబర్ నేరాలు, ఆర్‌బీఐ సూచనలు, ఆర్థికపరమైన అంశాల్లో ముడిపడిన జీవనశైలి తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించి చైతన్యం నింపడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మండల స్థాయి క్విజ్ పోటీలు ఈ నెల 27న 12 కేంద్రాల్లో, జిల్లాస్థాయి పోటీలు వచ్చే నెల 4న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నాగర్‌కర్నూల్‌లో నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి సెల్ నం.99899 21105ను సంప్రదించాలని కోరారు.

చదువే చక్కని భవిష్యత్‌కు పునాది



బల్మూర్: అచ్చంపేట ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆలిండియా టాపర్ వావిలాల చిద్విలాస్ రెడ్డిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఘనంగా సన్మానించారు. గురువారం స్వగ్రామమైన బల్మూర్ మండలం గోదల్‌కు చిద్విలాస్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చారు. భాజాభజంత్రీలతో రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గువ్వల మాట్లాడుతూ చదువే చక్కని భవిష్యత్‌కు పునాది అన్నారు. దేశంలో టాప్ విద్యా సంస్థలైన ఐఐటీల్లో ప్రవేశానికి జరిగే జేఈఈ పరీక్షలో అచ్చంపేట ప్రాంత బిడ్డ జయకేతనం ఎగురవేయడం గర్వకారణం అన్నారు. యావత్ నల్లమల ప్రజలు, విద్యావంతులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. లక్షలాది మంది విద్యార్థులు జేఈఈ పరీక్ష రాశారని, జాతీయ స్థాయిలో చిద్విలాస్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. చదువులో రాణిస్తూ ఆర్థికపరంగా ఇబ్బందులు ఉన్న పేద విద్యార్థులను ఆదుకుంటానన్నారు. అలాగే డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ చిద్విలాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు నాగలక్ష్మి, రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ బాలమ్మ, నాయకులు రుక్మారెడ్డి, చుక్కారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్లకు మంగళం

కనుమరుగు కానున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయాలు



కల్వకుర్తిలోని క్లస్టర్ కార్యాలయం

- పనితీరు సరిగా లేకపోవడంతో ఎత్తివేతకు ప్రభుత్వ నిర్ణయం
- పల్లె దవాఖానాల ద్వారానే ఆయా కార్యక్రమాల నిర్వహణ
- ఉద్యోగులకు అదే శాఖలోని వివిధ విభాగాల్లో పోస్టింగ్‌లు
- ఆదేశాలు రాలేదని జిల్లా వైద్యాధికారుల దాటవేత

కల్వకుర్తి టౌన్: వైద్యశాఖలో క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు క్లస్టర్ (డిప్యూటీ డీఎంహెచ్‌ఓ) కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వాల ఆలోచన సరిగానే ఉన్నా.. ప్రస్తుతం వారు ఎలాంటి విధులు నిర్వర్తించకుండా కేవలం కాగితాలపైన మాత్రమే పనిచేస్తున్నారని ప్రభుత్వం ఒక అవగాహన వచ్చింది. క్లస్టర్లలో పనిచేసే సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులు, పనితీరుపై థర్డ్ పార్టీతో సర్వే నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన జీఓ సైతం వచ్చినా జిల్లా వైద్యాధికారులు మాత్రం విషయాన్ని బయటకు చెప్పడం లేదు. క్లస్టర్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది మాత్రం గురువారం కార్యాలయంలో తమకు చివరిరోజు అని చెబుతున్నారు.

జిల్లాలోని క్లస్టర్లు ఇలా..

క్లస్టర్	పీహెచ్‌సీలు	వైద్యాధికారి
కల్వకుర్తి	6	భీమానాయక్
అచ్చంపేట	8	తారాసింగ్
నాగర్‌కర్నూల్ + కొల్లాపూర్	14	వెంకటదాస్

జిల్లాలు పెరగడంతో..

గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో తక్కువ సంఖ్యలో క్లస్టర్ కార్యాలయాలు ఉన్నాయి. నూతన జిల్లాలు ఏర్పడ్డాక అదే సంఖ్యలో క్లస్టర్ కార్యాలయాలు సైతం పెరిగాయి. కొన్ని చిన్న జిల్లాలో డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇద్దరూ ఒకే దగ్గర పనిచేయడం, అందులో కొందరు సిబ్బంది పని లేకుండా ఉండటమే ఆ కార్యాలయాల ఎత్తివేతకు ప్రధాన కారణంగా తెలుస్తుంది. అలాగే కొందరు సిబ్బంది ముఖ్యమైన పనులు ఉన్న సమయంలోనే రావడం, మిగతా సమయంలో సొంత వ్యాపారాలు, ఇతర పనులు చూసుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. వీటిని దృష్టిలో ఉంచుకొనే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి నిర్ణయం తీసుకున్నారని క్లస్టర్ అధికారులు చర్చించుకోవడం కార్యాలయాల ఎత్తివేతకు బలం చేకూరుస్తుంది.

కొత్తగా పల్లె దవాఖానాలు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యంపై అవగాహన కల్పించేందుకు గతంలో ఏర్పాటు చేసిన క్లస్టర్ కార్యాలయాలు కనుమరుగు అవుతుండటంతో వాటి స్థానంలో పల్లెదవాఖానాలు ఏర్పాటు చేయబోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే పల్లె దవాఖానాలో ఎంబీబీఎస్ వైద్యుడు లేదా, బీఎస్సీ నర్సింగ్‌లో బ్రిడ్జి కోర్సు చేసిన వారిని నియమించనున్నా రు. వీరికి తోడుగా ఒక స్టాఫ్ నర్సు, ఏఎన్‌ఎం, ఆ శా కార్యకర్తను నియమించి వైద్యసేవలతోపాటు రోగాలపై నిరంతరం అవగాహన కల్పించనున్నారు.

20 మండలాలు.. 28 పీహెచ్‌సీలు

జిల్లాలో 20 మండలాలకు కలిపి మూడు క్లస్టర్ కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ కార్యాలయాలు ఉండగా వీటి పరిధిలో 28 పీహెచ్‌సీలున్నాయి. కల్వకుర్తి క్లస్టర్ పరిధిలో 6 పీహెచ్‌సీలు, అచ్చంపేట పరిధిలో 8, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌లో కలిపి 14 పీహెచ్‌సీలు ఉండగా.. ప్రతి క్లస్టర్‌లో 10 మంది వరకు సిబ్బంది పనిచేసున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా వైద్యాధికారి, డీపీఎం (దయాపారా మెడికల్ ఆఫీసర్), సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్), ఎస్‌యూఓ (సబ్ యూనిట్ ఆఫీసర్), హెచ్‌ఈ (హెల్త్ ఎడ్యుకేటర్), ఆప్తాలమిక్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ ఉన్నారు. వీరందరిని జిల్లాలోని వైద్యశాఖలో లేదా ఇతర జిల్లాలో ఏవైనా ఖాళీలు ఉంటే వాటిలో సర్దుబాటు చేయనున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



జిల్లాలోని క్లస్టర్ల ఎత్తివేతకు సంబంధించి గతంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే వీటి తీసివేతకు సంబంధించి మా వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లస్టర్ కార్యాలయాల ఎత్తివేత ప్రక్రియ ప్రారంభమవుతుంది. – సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌ఓ

కళాజాతాల అవగాహన

వైద్య, ఆరోగ్య శాఖలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న క్లస్టర్లు కార్యాలయాలు కనుమరుగు కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు, రోగాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాన్న అంశాలపై క్లస్టర్‌లో పనిచేసే వైద్య సిబ్బంది కళాజాతా ద్వారా అవగాహన కల్పించేవారు. వైద్య, ఆరోగ్యానికి సంబంధించి ప్రజలకు ఎలాంటి అనుమానాలు ఉన్నా వారు ప్రజల వద్దకే వెళ్లి నివృత్తి చేసి రోగాన్ని నయం చేసేలా చొరవ చూపేవారు. అయితే ప్రస్తుతం క్లస్టర్ కార్యాలయాల సిబ్బంది ఎలాంటి విధులు నిర్వర్తించకపోవడంతో ప్రభుత్వం ఎత్తివేత నిర్ణయం తీసుకుందని క్లస్టర్ సిబ్బంది చెప్పుకోవడం గమనార్హం.

జిల్లా సైన్స్ అధికారికి రాష్ట్రస్థాయిలో ప్రశంసలు



కృష్ణారెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి తదితరులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వాళ్లలోని ప్రతిభను బయటపడేలా సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలను రూపొందించేందుకు కృషిచేస్తున్న జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డిని గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ కార్యక్రమం నిర్వహిస్తుందని, విద్యార్థి దశలోనే ఆవిష్కరణలు చేసేలా వారిని ప్రోత్సహించేందుకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ పనిచేస్తుందని చెప్పారు. ప్రశంసలు వచ్చిన స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా పనిచేస్తానని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో యూపీఎస్‌సీ–సీఎస్‌ఏటీ పరీక్ష కోసం 2023–24 విద్యాసంవత్సరంలో 100 మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి టైటస్‌పాల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కోసం రిజర్వేషన్ ప్రకారం మహిళలకు 33.33 శాతం, అన్ని రిజర్వు కేటగిరీలో దివ్యాంగులకు 5 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మైనార్టీ స్టడీసర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రవేశం కోసం సాధారణ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు ఈనెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు www.cet.cgg.gov.in/tmreis వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, జూలై 23న జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.మిగతా వివరాల కోసం 040–23236112 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

'రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు'



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాగం జనార్దన్‌రెడ్డి తదితరులు

నాగర్‌కర్నూల్ క్రైం: తెలంగాణ సిద్ధించి తొమ్మిదేళ్లయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ నెల 2 నుంచి 22 వరకు ప్రజాధనాన్ని దుర్వినియోగపరుస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారానికి దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తుందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల వ్యతిరేక నిరసన ర్యాలీ నిర్వహించి సీఎం కేసీఆర్ పదితలల దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా యావత్ తెలంగాణ సమాజం జరిపిన పోరాటాలు, 1,200 మందికిపైగా ఆత్మ బలిదానాలు చేసి తెలంగాణ సాధిస్తే గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లు దాటినా ఆశయ సాధన దిశగా అడుగులు వేయలేకపోయిందని విమర్శించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టినందుకు సంబరాలు చేసుకుంటున్నారా అని మండిపడ్డారు. కృష్ణా నీళ్ల ఆంధ్ర ప్రభుత్వం వాడుకోవచ్చని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిందని ఫలితంగా నీటిని ఆంధ్రకు తరలించుకుపోతుంటే చోద్యం చూడటం తప్ప చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వాలకు ముందుచూపు ఉన్నందునే సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రతి ప్రాజెక్టు గత ప్రభుత్వాలు ప్రారంభించి 90 శాతం పనులు పూర్తి చేసినవేనన్నారు. తొమ్మిదేళ్లలో ప్రాజెక్టులకు, రిజర్వాయర్లకు పిల్ల కాల్వలు తవ్వించి నీరందించలేని బీఆర్‌ఎస్‌కు గత ప్రభుత్వాలను విమర్శించే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, అధికార ప్రతినిధి యోగేశ్వర్‌రెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, అర్థం రవి, సునేంద్ర, నిజాం తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి



గద్వాల అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఉస్మానియా యూనివర్శిటీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాజు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.5,300 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, సిబ్బందిని నియమించాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అక్రమంగా నోట్ బుక్కులు, పుస్తకాలు విక్రయిస్తున్నారని వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, రఘువంశీ, సురేష్, గణేష్, మహేష్, శ్రీకాంత్, తేజ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆత్మలు శాంతించేలా..

ప్రజాసేవకు పునరంకితమవుతాం



అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తదితరులు

నాగర్‌కర్నూల్ క్రైం: అమరుల త్యాగాలను వృథా కానివ్వమని, అమరవీరుల ఆత్మలు శాంతించే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేలా ప్రజాసేవకు పునరంకితమవుతామని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ కె.మనోహర్‌తో కలిసి ప్రభుత్వ విప్ అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేత, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పడి 10వ వసంతంలోకి అడుగుపెడుతున్న వేళ, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను త్యజించిన అమరుల యాదిలో జరిగిన అభివృద్ధి వెలుగులు నేడు రాష్ట్రమంతటా కనిపిస్తున్నాయన్నారు. దేశ చరిత్రలోనే ఘనకీర్తి కలిగిన తెలంగాణ మట్టిబిడ్డల మనోవేదనకు ముగింపు పడి, త్యాగాల తెలంగాణ బానిస సంకెళ్లను తెంచుకొని స్వరాష్ట్రంలో తలెత్తుకొని సగర్వంగా నిలబడి దశాబ్ది ఉత్సవాలను జరుపుకొంటున్నామన్నారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమరుల సంస్మరణ తీర్మానాలను జెడ్పీ చైర్‌పర్సన్ ప్రవేశపెట్టి తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన సమానత్వ విలువ కోసం జరిగిన మహత్తర పోరాటంతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. అన్ని రంగాల్లో అమలైన వివక్షకు వ్యతిరేకంగా, తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం ఉద్యమం కొనసాగిందన్నారు. ఆరు దశాబ్దాలపాటు తొలి, మలిదశల్లో సాగిన ఈ పోరాటం త్యాగపూరితమైనది అని కొనియాడారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో దశాబ్ది ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగిందని, అందుకు సహకరించి పాలుపంచుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లాలో రాష్ట్ర సాధన కోసం ఆత్మ బలిదానాలు చేసిన వంకేశ్వరం గ్రామానికి చెందిన అమరవీరుడు నాగరాజు తల్లి ఈశ్వరమ్మ, ఉప్పునుంతలకు చెందిన అమరవీరుడు బాలస్వామి భార్య అలివేలు, కల్వకుర్తికి చెందిన అమరవీరుడు కృష్ణయ్య కుమారుడు రామును ఘనంగా సత్కరించారు. అమరుల కుటుంబాలకు ప్రభుత్వ విప్ పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మనూచౌదరి, జెడ్పీసీఈఓ భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ బాలాజీసింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

40 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

- ఉమ్మడి జిల్లాలో పోలీస్‌శాఖలో భారీ మార్పులు
- త్వరలో సీఐల బదిలీలు



మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్‌లతో పాటు ఎస్పీ కార్యాలయాల్లో పని చేస్తున్న 40 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం 13మంది ఎస్‌ఐలకు స్థానచలనం కల్పించగా.. కొత్తగా మళ్లీ 40 మందిని బదిలీ చేశారు. త్వరలో సీఐలు కూడా బదిలీ కానున్నట్లు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో పోలీస్ శాఖలో భారీగా ఎస్‌ఐలు, సీఐల బదిలీలు చోటు చేసుకుంటున్నాయి. చాలా ఏళ్లుగా ఒకే దగ్గర పోస్టింగ్‌లో ఉన్న వారికి స్థానచలనం తప్పడం లేదు.

ఎస్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
సీహెచ్ శ్రీకాంత్	టూటౌన్ మహబూబ్‌నగర్	అటాచ్ డీఎస్‌బీ, మహబూబ్‌నగర్
ఎస్.బాల్‌రెడ్డి	ఉమెన్ పీఎస్.మహబూబ్‌నగర్	అటాచ్ డీఎస్‌బీ, మహబూబ్‌నగర్
బి.సుజాత	ఉమెన్ పీఎస్, మహబూబ్‌నగర్	అటాచ్ డీఎస్‌బీ, మహబూబ్‌నగర్
ఎంఏ ఖాదర్	జడ్చర్ల	వీఆర్, నారాయణపేట
వై.భాగ్యలక్ష్మీరెడ్డి	ఎస్‌ఐ–2 భూత్పూర్	అటాచ్ డీఎస్‌బీ, మహబూబ్‌నగర్
జి.భాస్కర్‌రెడ్డి	భూత్పూర్	అటాచ్ డీఎస్‌బీ, మహబూబ్‌నగర్
ఎంఏ అజీజుల్లా	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్	వీఆర్, నారాయణపేట
ఎం.శైలజ	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్	వీఆర్, గద్వాల
అరుణ	డీసీఆర్‌బీ, మహబూబ్‌నగర్	వీఆర్, గద్వాల
బాలయ్య	కంట్రోల్ రూం, మహబూబ్‌నగర్	వీఆర్, వనపర్తి
పెద్ద అంజయ్య	వీఆర్, మహబూబ్‌నగర్	వీఆర్, నాగర్‌కర్నూల్
కె.బద్రీనాథ్	ట్రాఫిక్ పీఎస్, మహబూబ్‌నగర్	వీఆర్, వనపర్తి
ఎండీ మిస్బాద్దీన్	వీఆర్,మహబూబ్‌నగర్	వీఆర్, వనపర్తి
కె.సుజాత	టూటౌన్, మహబూబ్‌నగర్	వీఆర్, మహబూబ్‌నగర్
రమేష్	రూరల్ పీఎస్, మహబూబ్‌నగర్	వీఆర్, మహబూబ్‌నగర్
ఎం.గోపాల్	ట్రాఫిక్ పీఎస్, మహబూబ్‌నగర్	వీఆర్, నాగర్‌కర్నూల్
జి.విజయ్‌కుమార్	నాగర్‌కర్నూల్	డీఎస్‌బీ, నాగర్‌కర్నూల్
ఖుర్షీద్‌అలీ	డీఎస్‌బీ, నాగర్‌కర్నూల్	పీసీఆర్ నాగర్‌కర్నూల్
బి.సురేష్	సీసీఎస్, నాగర్‌కర్నూల్	డీఎస్‌బీ, నాగర్‌కర్నూల్
మణిక్యనాయక్	వీఆర్, నాగర్‌కర్నూల్	వీఆర్, వనపర్తి
నాగరాజన్	సీసీఎస్, నాగర్‌కర్నూల్	వీఆర్, మహబూబ్‌నగర్
పి.శ్రీనివాసులు	తాడూర్	వీఆర్, గద్వాల
రామన్‌గౌడ్	బీపనగండ్ల	అటాచ్ డీఎస్‌బీ వనపర్తి
కేటీ మల్లేష్	శ్రీరంగాపురం	వీఆర్, గద్వాల
వహీద్‌అలీ బేగ్	పెబ్బేర్	అటాచ్ డీఎస్‌బీ వనపర్తి
వెంకటేశ్వర్‌గౌడ్	సీసీఎస్, వనపర్తి	వీఆర్, నాగర్‌కర్నూల్
రిషికేష్	సీసీఎస్, వనపర్తి	వీఆర్, మహబూబ్‌నగర్
ఆర్.శేఖర్	మల్దకల్	వీఆర్, గద్వాల
కె.గోకరి	ఇటిక్యాల	వీఆర్, మహబూబ్‌నగర్
వెంకటస్వామి	కోదండపూర్	వీఆర్, వనపర్తి
ఎం.సంతోష్	మానవపాడు	వీఆర్, నారాయణపేట
ఎంఏ రషీద్	సీసీఎస్,గద్వాల	వీఆర్, గద్వాల
కేశవరావు	సీసీఎస్, గద్వాల	వీఆర్, గద్వాల
రమాదేవి	సీసీఎస్ గద్వాల	వీఆర్ గద్వాల
అభిషేక్‌రెడ్డి	డీసీఆర్‌బీ, గద్వాల	వీఆర్, గద్వాల
సి.సురేష్‌గౌడ్	నారాయణపేట	వీఆర్, నారాయణపేట
ఎం.సుధమాదురి	వీఆర్, నారాయణపేట	వీఆర్, మహబూబ్‌నగర్
టి.చంద్రశేఖర్	ఎస్‌ఐ–2 నారాయణపేట	వీఆర్, నారాయణపేట
ఏ.విజయ్‌కుమార్	వీఆర్, నారాయణపేట	వీఆర్, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి గొర్రెల కాపరి మృతి


మహేష్(ఫైల్)

ఖిల్లాఘనపురం: బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు ఢీకొని గొర్రెల కాపరి మృతిచెందిన సంఘటన ఖిల్లాఘనపురం మండలం మల్కాపురం సమీపంలో చోటు చేసుకుంది. మల్కాపురం గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఏనుగొండకి చెందిన గొర్రెల కాపరి బొడ్డు మహేష్(24) మేనమామ ఊరైన అడ్డాకుల మండలం కందూరుకు వచ్చి నివాసం ఉంటున్నాడు. తోటి కాపరులతో కలిసి గొర్రెలను మేపేందుకు ఖిల్లాఘనపురం మండలం మామిడిమాడ గ్రామ శివారుకు మందను తీసుకొచ్చాడు. గురువారం కందూరుకు వెళ్లి కాపరులందరికీ భోజనం తీసుకొచ్చేందుకు మోటర్ సైకిల్‌పై బయలు దేరాడు. మల్కాపురం గ్రామ సమీపంలోకి వచ్చిన వెంట మోటార్ సైకిల్ అదుపుతప్పి పక్కన్నే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. అతని భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై మృతుని తమ్ముడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి బలవన్మరణం

వెల్దండ: మానసిక ఒత్తిడికి గురై ఓ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెల్దండలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన దత్తం రమేష్(32) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ హోటల్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పదిరోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆయన స్థానికంగానే సెంట్రింగ్ సక్రింగ్ పనిచేసుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం పనికి వెళ్తున్నట్లుగానే ఇంటి నుంచి వెళ్లి.. మధ్యాహ్న సమయంలో ఇంటికి తిరిగి వచ్చి ఇంటి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. వారు వచ్చి ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. రమేష్ భార్య గతంలోనే విడిపోయింది. ఈ క్రమంలోనే మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పురుగు మందుతాగి వ్యక్తి..

వనపర్తి: పురుగు మందుతాగి తన పొలంలోనే ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రాజపేటలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లయ్య(42) బుధవారం ఉదయం ఇంటినుంచి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, పొలం వద్ద వెతకగా పురుగు మందు తాగి మృతి చెందినట్లు గుర్తించారు. ఎల్లయ్యకు భార్య లక్ష్మితోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. గతంలోనూ ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు వారు తెలిపారు. పోలీసులు ఫిర్యాదు ఇవ్వలేదు.

అనారోగ్యంతో వివాహిత..

పాన్‌గల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. దొండాయిపల్లికి చెందిన బోయ పద్మ(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఎన్ని ఆస్పత్రులకు చూపించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. పద్మ భర్త సైతం కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. ఈ ఘటనపై పద్మ కూతురు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.


కడుపునొప్పితో మరొకరు..

జడ్చర్ల: కడుపునొప్పి భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ కథనం ప్రకారం.. మండలంలోని ఉదండాపూర్‌కు చెందిన మహమూదబేగం(45) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుంది. ఈ క్రమంలో ఈ నెల 17న ఇంటిలో కడుపునొప్పి భరించలేక పంటలకు వినియోగించే గుళికల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా.. గమనించిన కుటుంబ సభ్యులు జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఈ ఘటనపై కూతురు తహసీన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు పక్కన మహిళ మృతదేహం

బిజినేపల్లి: మండలంలో మహిళ మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. ఎస్సై కృష్ణ ఓబుల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అల్లీపూర్ గేటు సమీపంలో రోడ్డు పక్కన్న ఒక మహిళ మృతదేహం ఉండటాన్ని ప్రయాణికులు గమనించి, సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదని తెలిపారు. నల్లని చీర, జాకెట్టు, ఎర్రటి వస్త్రం, ఎర్రమట్టి గాజులు ధరించి ఉందని, ఎడమ చేతికి ఉంగరం ఉందని తెలిపారు.

తాగునీటి సమస్యకు చెక్


మున్సిపాలిటీ వ్యూ

- అమృత్ 2.0కు జడ్చర్ల మున్సిపాలిటీ ఎంపిక
- ఇప్పటికే రూ.47కోట్లు మంజూరు
- మున్సిపల్ విలీనగ్రామాలు, నూతన కాలనీల్లో తీరనున్న తాగునీటి సమస్య


మున్సిపాలిటీ కార్యాలయం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. దీని కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకానికి జడ్చర్ల మున్సిపాలిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు రూ.47కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరో 20ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా పనులు చేపట్టనున్నారు. మున్సిపాలిటీలోని కావేరమ్మపేట, జడ్చర్ల, బూరెడ్డిపల్లి, నాగసాల, నక్కలబండతండ, శంకరాయపల్లి తండాలు విలీనమయ్యాయి. విలీన గ్రామాల్లో కొంత నీటి సమస్య ఉంది. అమృత్ 2.0 పథకంలో మంజూరైన రూ.47కోట్ల ద్వారా అన్ని గ్రామాల్లోనూ సమస్యలు పరిష్కారం కానున్నాయి. మున్సిపాలిటీలో లక్షా 10వేలకుపైగా జనాభా ఉండగా, 17వేలకుపైగా ఇళ్లున్నాయి. ప్రస్తుతం 9వేలకుపైగా నల్లా కనెక్షన్లు ఉన్నాయి. పట్టణంలో ప్రస్తుతం 20ట్యాంకులు ఉండగా, 200 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేశారు.

సామాజిక కార్యకర్తకు సమాచారం..

పట్టణంలోని సామాజిక కార్యకర్త కంచుకోట ఆనంద్ పలు సమస్యలపై ఉన్నతాధికారులకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ లేఖలు రాయటం పరిపాటిగా మారింది. ఆ లేఖల్లో నీటి ప్రాజెక్టు అమృత్ 2.0 ఒకటి. అయితే ప్రాజెక్టుకు ఎంపిక చేసినట్లుగా మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అర్బన్ అఫైర్స్ సెక్రెటరి పి.ఏ.లతిక సామాజిక కార్యకర్తకు లేఖను పంపించటం గమనార్హం.

రియల్ వెంచర్లతో పెరుగుతున్న సమస్య

మున్సిపాలిటీ పరిధిలో కొంతకాలంగా వెలుస్తున్న రియల్ వెంచర్ల వల్ల నీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. వాస్తవానికి వెంచరు దారులే ప్రతి ఇంటికి నీటి సౌకర్యం వసతి కల్పించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా అడుగులు వేయకపోవటంతో మున్సిపాలిటీపై భారం పడుతుంది. కొత్తకాలనీలకు నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితి వల్లే మిషన్ భగీరథ పథకం అమలు చేస్తున్నప్పటికీ సమస్యలు వస్తూనే ఉన్నాయి.

అమృత్ 2.0లో ఇవీ ప్రతిపాదనలు..

అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరైన నిధులతో మున్సిపాలిటీలో కింది పనులు చేపట్టనున్నారు. నూతనంగా 53 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల 6 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 30వేల లీటర్ల సామర్థ్యం కల 1స్లంప్ నిర్మించనున్నారు. 2.5కి.మీటర్ల మేర ఫీడర్ పైప్‌లైన్ వేయనున్నారు. ఇంటింటికీ నీటిని సరఫరా చేసేందుకు గానూ 62.5 కి.మీటర్ల మేర పైప్‌లైన్ వేయనున్నారు. అదేవిధంగా 7,954 నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయటంతో పాటు టెండర్లు పిలిచారు. టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు మొదలు పెట్టనున్నారు.

అమృత్ 2.0 ద్వారా సమస్య పరిష్కారం



మున్సిపాలిటీలో అమృత్ 2.0 ద్వారా రూ.47కోట్లు విడుదల అయ్యాయి. ఈ మేరకు చేపట్టాల్సిన పనులను పబ్లిక్‌హెల్త్ వర్క్స్ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నూతనంగా 6ఓవర్‌హెడ్ ట్యాంకులు, 1 స్లంప్, 2.5కిలోమీటర్ల మేర ఫీడర్ పైప్‌లైన్, 62.5కి.మీటర్ల మేర పైప్‌లైన్‌లు వేయనున్నాం. టెండరు ప్రక్రియ కొనసాగుతుంది. ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపడతాం.

–మహమూద్‌షేక్, కమిషనర్ మున్సిపాలిటీ, జడ్చర్ల

విలీన గ్రామాల్లో సమస్య పరిష్కారం



అమృత్ 2.0 పథకంలో మున్సిపాలిటీ ఎంపిక కావటంతో నీటి సమస్య పూర్తిగా తీరనుంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి మిషన్‌భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీటిని అందిస్తున్నారు. మున్సిపాలిటీలో విలీన గ్రామాలు, కొత్తకాలనీల్లో కొంత సమస్య ఉంది. అమృత్ 2.0 పథకం ద్వారా వాటిల్లోనూ సమస్యలు తీరుస్తాం.

–లక్ష్మి, చైర్‌పర్సన్, మున్సిపాలిటీ జడ్చర్ల

గురుకుల పాఠశాలలో స్విట్జర్లాండ్ బృందం


గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న స్విట్జర్లాండ్ బృందం సభ్యులు

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం స్విట్జర్లాండ్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం సభ్యుడు బ్రోస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మంచి విద్యను అందిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో స్విట్జర్లాండ్ విద్యా విధానం వస్తే ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. స్విట్జర్లాండ్ విద్యా విధానంలో ముందుగా ఓ ఉద్యోగ కంపెనీ యాజమాన్యం భవిష్యత్‌లో వారిని ఉద్యోగంలోకి తీసుకోవడం కోసం పాఠశాల స్థాయి నుంచే ఒకేషనల్ కంప్యూటర్ విద్యలో నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కోర్సుల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు కంపెనీ ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని చెప్పారు. అలాంటి కోర్సులను కూడా ఇక్కడ అమలు చేయడానికి రాష్ట్ర టీఎస్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి రొనాల్డ్‌రోస్ అనుమతితో రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలను విజిట్ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇక్కడి ఉపాధ్యాయులు అందిస్తున్న ఒకేషనల్ కంప్యూటర్ విద్యా విధానం, అందుకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో టీఎస్‌డీపీఎస్ వరుణ్‌శర్మ, ప్రిన్సిపాల్ అనురాధ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బయటపడ్డ విభేదాలు


జడ్చర్లలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న టీపీసీసీ సెక్రటరీ అనిరుద్‌రెడ్డి

- సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

జడ్చర్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిరసిస్తూ టీపీసీసీ పిలుపు మేరకు గురువారం జడ్చర్లలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ పది తలల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో టీపీసీసీ కార్యదర్శి అనిరుద్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు రబ్బానీ, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు వెంకటయ్య, వార్డు కౌన్సిలర్ విజయ్, వంశీ పాల్గొన్నారు.

వేర్వేరుగా ఆందోళనలు..

ఒకే పార్టీ నేతలు ఒకే చోట ఓ గంట తేడాతో ఒకే నిరసన కార్యక్రమాన్ని వేర్వేరుగా చేపట్టిన సంఘటన గురువారం జడ్చర్లలో చోటు చేసుకుంది. టీపీసీసీ పిలుపు మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో జడ్చర్ల అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న ఇరువురి నేతల వైఖరి మరోసారి బయటపడింది. టీపీసీసీ సెక్రటరీ అనిరుద్‌రెడ్డి రాకముందే టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ తన అనుచరులతో కలిసి అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాన రహదారిపై బైఠాయించి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి వెళ్లిపోయారు. తర్వాత కొద్దిసేపటికి టీపీసీసీ సెక్రటరీ అనిరుద్‌రెడ్డి తన అనుచర గణంతో ర్యాలీగా వచ్చి అదే స్థలంలో ఆందోళన చేపట్టి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఇవన్నీ మామూలేనంటే కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎండీ రబ్బానీ మీడియాతో మాట్లాడుతూ చెప్పడం గమనార్హం.

పిడుగుపడి వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతి

- మరో మహిళకు తీవ్రగాయాలు.. ఇద్దరికి తప్పిన ముప్పు


లక్ష్మమ్మ (ఫైల్)

అడ్డాకుల: భార్యాభర్తలు కలిసి మేస్త్రీ పని చేసేందుకు వెళ్లారు. చిన్నపాటి వర్షం రావడంతో ఓ చెట్టు కిందకు చేరారు. వర్షం వెలిసిన తర్వాత చెట్టు కింద నుంచి ఇద్దరు వ్యక్తులు పని వద్దకు వెళ్లగా.. వారి భార్యలు చెట్టు కిందనే ఉండిపోయారు. ఈ క్రమంలో పిడుగు పడటంతో ఓ మహిళ మృతిచెందగా.. మరో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మూసాపేట మండలంలోని పోలకంపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ నసులాయి లక్ష్మమ్మ(25), వీరస్వామి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరస్వామి మేస్త్రీ పని చేస్తుండగా.. భార్య సైతం కూలీ పనికి వెళ్లేది. అదే గ్రామానికి చెందిన మాల నాగరాజు, లక్ష్మి దంపతులు సైతం మేస్త్రీ పనిచేసుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో వీరస్వామి, నాగరాజులు తమ భార్యలతో కలిసి గ్రామ సమీపంలోని గంజి కృష్ణయ్య, గంజి లక్ష్మయ్య పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నిర్మించడానికి గురువారం ఉదయం వెళ్లారు. సాయంత్రం చిన్నపాటి వర్షం పడటంతో నలుగురు కలిసి సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత వర్షం తగ్గడంతో వీరస్వామి, నాగరాజులు పని వద్దకు వెళ్తుండగానే పిడుగు పడింది. అప్పటి వరకు చెట్టు కిందనే ఉన్న ఇద్దరు మహిళల్లో కుర్వ లక్ష్మమ్మ పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందగా మాల లక్ష్మి గాయపడింది. వెంటనే సమీపంలోని వారు ఇద్దరిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

క్షణాల వ్యవధిలో తప్పిన ముప్పు

నలుగురు చెట్టు కింద ఉన్నప్పుడు పిడుగు పడితే ఘోర ప్రమాదం సంభవించి ఉండేది. ఇద్దరు భర్తలు చెట్టు కింద నుంచి పదడుగుల దూరం వెళ్లగానే పిడుగు పడటంతో వారిద్దరికి ముప్పు తప్పింది. ఇద్దరు మహిళలు కూడా చెట్టు కింద నుంచి బయటకు వచ్చే క్షణంలోనే పిడుగు పడటం లక్ష్మమ్మ పాలిట శాపమైంది. చెట్టు కింద నుంచి భర్తలు బయటకి వచ్చినప్పుడే మహిళలు కూడా వస్తే ప్రమాదం నుంచి బయటపడే వారని గ్రామస్తులు తెలిపారు.

బోరవెల్లిలో మరొకరు..


రామానాయుడు (ఫైల్)

మానవపాడు: పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బోరవెల్లిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రామానాయుడు(55) ఆవులను మేపుతుండగా వర్షం పడటంతో చెటుకింద కూర్చున్నాడు. ఈ క్రమంలో పెద్ద శబ్దం చేస్తూ పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం ఆవులు ఇంటికి రాగా.. రామానాయుడు మాత్రం రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామ శివారులో వెతకగా మృతదేహం కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. రామానాయుడుకు భార్య రాజమ్మ, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

- బ్యాంకు అధికారుల ఒత్తిడే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ


శంకరయ్య (ఫైల్)

కోయిల్‌కొండ: గుండెపోటుతో ఓ రైతు మృతిచెందగా.. ఇందుకు బ్యాంకు అధికారుల ఒత్తిడే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని అభంగపట్నం గ్రామానికి చెందిన రైతు శంకరయ్య(65) గార్లపహాడ్‌లోని కోఆపరేటివ్ సొసైటీలో 1991 సంవత్సరంలో తన 5.27 ఎకరాల భూమిపై రూ.21వేలు, మరోసారి రూ.6 వేలు రుణం తీసుకున్నాడు. అయితే 30 ఏళ్లుగా రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో వడ్డీతో కలిపి రూ.4 లక్షల వరకు బాకీ ఉంది. దీనిపై పలుమార్లు సొసైటీ అధికారులు శంకరయ్య ఇంటికి వచ్చి రుణం చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. బుధవారం సైతం సదరు అధికారులు వచ్చి రుణం చెల్లించాలని చెప్పగా.. త్వరలో చెల్లిస్తానని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. కొద్ది సేపటి తర్వాత శంకరయ్య ఛాతి నొప్పితో బాధపడుతూ మృతిచెందాడు. సొసైటీ అధికారులు ఒత్తిడి చేయడం వల్లే శంకరయ్య మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ భారతి స్పందిస్తూ శంకరయ్య తీసుకున్న రుణానికి సంబంధించి వన్‌టైం సెటిల్‌మెంట్ పథకంలో భాగంగా రూ.1.40 లక్షలు మాఫీ చేస్తామని, మిగతా డబ్బు కట్టాలని మాత్రమే కోరినట్లు చెప్పారు. శంకరయ్యపై తాము ఒత్తిడి తేలేదని పేర్కొన్నారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

పెద్దకొత్తపల్లి: రోడ్డు పక్కన నిల్చున్న ఓ మహిళను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందగా.. మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి సీఐ యాలాద్రి కథనం ప్రకారం.. మండలంలోని కల్వకోల్‌కు చెందిన గొల్ల శ్వేతమ్మ(40) తన కుమార్తెను హైదరాబాద్‌లోని గురుకుల కళాశాలలో చేర్పించి గురువారం రాత్రి 9 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి చేరుకుంది. బస్సు దిగి బస్టాప్ వద్దనే నిల్చుని ఉండగా కొల్లాపూర్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హన్మంతునాయక్‌కు చెందిన కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్వేతమ్మ అక్కడికక్కడే మృతిచెందగా బస్టాప్‌లోనే నిల్చున్న సురేష్‌గౌడ్ అనే యువకుడికి రెండు కాళ్లు విరిగాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి ఘటనా స్థలాన్ని సీఐ యాలాద్రి, ఎస్‌ఐ రాజుయాదవ్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. శ్వేతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. శ్వేతమ్మ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గట్టును పలకరించిన తొలకరి వర్షం

- గొర్రవరి విత్తుకునే పనులు ప్రారంభం
- ఎలాంటి రసాయనాలు లేకుండా వర్షంపైనే ఆధారం


గట్టు శివారులో గొర్రవరిని విత్తుకుంటున్న రైతు

గట్టు: ఎట్టకేలకు తొలకరి వర్షం మండల రైతులను పలుకరించింది. బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో 25.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో గురువారం వర్షాధారంగా సాగు చేసే గొర్రవరిని రైతులు విత్తుకునే పనులను ప్రారంభించారు. వర్షం కోసం కళ్లు కాయలు కాచేలా రైతులు ఎదురు చూశారు. కాస్త ఆలస్యం కావడంతో ఆందోళన చెందుతూ వచ్చారు. దీనికి తోడు ఎండలు మండుతుండడంతో మెట్ట భూముల్లో నీటి వసతి ఆధారంగా సాగు చేసిన పత్తి పంటలు దెబ్బతిన్నాయి. రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తూ, ఓ మోస్తరు వర్షం కురువడంతో అన్నదాతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. జాలు (ఊట) నీటితో పండించే గొర్రవరిని విత్తుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. వానాకాలం ప్రారంభంలోనే వర్షాధారంగా గొర్రవరిని ఈ ప్రాంత రైతులు విత్తుకుంటారు. ఇలా మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో వరిని పండిస్తున్నారు. ఇక్కడ తప్పా రాష్ట్రంలో గొర్రవరిని వర్షాధారంగా మరెక్కడా పండించరు. రసాయనిక ఎరువులు, క్రిమీ సంహారక మందుల పిచికారి లేకుండా కేవలం వర్షపు నీటితో పంటను ఈ ప్రాంతంలో రైతులు పండిస్తుంటారు. ఎకరాకు 20 నుంచి 25 బస్తాల వరకు దిగుబడిని సాధిస్తుంటారు.

తుమ్మలపల్లిలో గుప్తనిధుల తవ్వకాలు


గుప్తనిధుల కోసం తవ్విన ప్రాంతం

వంగూరు: మండలంలోని తుమ్మలపల్లి శివారులోని వ్యవసాయపొలంలో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల తవ్వకానికి పాల్పడ్డారు. రైతు నర్సింహారెడ్డి పొలంలో జేసీబీతో గుంతలు తీశారు. ఒక మేకను కూడా కోశారు. గురువారం ఉదయం దీన్ని గమనించిన రైతు నర్సింహారెడ్డి వంగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

గోపాల్‌పేట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని ఏదులలో గురువారం వెలుగు చూసింది. గోపాల్‌పేట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏదులకు చెందిన బొల్లె ఆనంద్ కుమారుడు బొల్లె అరుణ్ కుమార్(22) కారు డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. బుధవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు సాయంత్రం నుంచి వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ఏదుల శివారులోని ఓ బావి వద్ద బైకు, చెప్పులు కనిపించాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులు, ఫైర్ సిబ్బందితో కలిసి మోటార్లతో బావిలోని నీరు బయటికి తోడగా అరుణ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి మరణంపై అనుమానం ఉందని తండ్రి బొల్లె ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలియజేశారు. మృతుడికి వారం రోజుల కిందట అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో అందరి సమక్షంలో ప్రేమ వివాహమైందని తెలిసింది.

15 బస్తాల బెల్లం పట్టివేత


పట్టుబడిన బెల్లం బస్తాలు, కారు

లింగాల: మండలంలోని జీల్గుపల్లితండాలో గురువారం ఎక్సైజ్ శాఖ, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో 15 బస్తాలు (450 కిలోల) సారా తయారీ బెల్లం, 30 కిలోల పట్టిక స్వాధీనపర్చుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్ కథనం ప్రకారం.. ఉప్పునుంతల మండలం దేవదారి కుంటకు చెందిన కాట్రావత్ శివప్రసాద్ కారులో బెల్లాన్ని జీల్గుపల్లితండాకు తరలిస్తున్నాడనే సమాచారంతో దాడులు జరిపినట్లు ఆయన తెలిపారు. బెల్లం, పట్టికను తండాకు చెందిన కాట్రావత్ గణేష్‌నాయక్ ఇంటి నుంచి స్వాధీనపర్చుకున్నారు. అలాగే 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. గణేష్‌నాయక్, శివప్రసాద్ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ మునీరొద్దీన్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. దాడుల్లో లింగాల ఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, ఈసీలు నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

పాముకాటుకు గురై బాలుడు మృతి


అజయ్ (ఫైల్)

అయిజ: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అజయ్ (13) పాముకాటుకు గురై మృతిచెందినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపాడు. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎలుక రాజు కుమారుడు అజయ్ కుటుకనూరు గ్రామంలో ఫంక్షన్‌కు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం వెళ్లాడు. అక్కడ నిద్రిస్తున్న సమయంలో రాత్రి పాముకాటుకు గురయ్యాడు. కుటుంబసభ్యులు గమనించి కర్నూలు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

సీఎం బోనాల శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: గోల్కొండ ఆషాఢ బోనాల పండుగ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు గురువారం రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నదని, తద్వారా తెలంగాణ సబ్బండ వర్గాల సంస్కృతికి పెద్దపీట వేసిందన్నారు. తరతరాల తెలంగాణ సాంస్కృతిక ఆధ్యాత్మిక అస్తిత్వానికి బోనాల పండుగ ప్రతీకగా నిలిచిందన్నారు. బోనాల పండుగ ప్రారంభంనాడు వాన చినుకుల రూపంలో మనందరిమీద అమ్మవారు కరుణాకటాక్షాలు కురిపిస్తుండటం శుభసూచకమని అన్నారు.

అదనంగా 880 పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్లు



దాసరి బాలయ్య

కంటోన్మెంట్: పాస్‌పోర్టుల దరఖాస్తుల డిమాండ్ దృష్ట్యా ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు అదనంగా 880 అపాయింట్‌మెంట్‌లు ఇవ్వనున్నట్లు సికింద్రాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ దాసరి బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బేగంపేట, అమీర్‌పేట, టోలిచౌకితో పాటు కరీంనగర్, నిజామాబాద్‌లలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో రోజుకు 220 చొప్పున అదనపు అపాయింట్‌మెంట్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అదనపు అపాయింట్‌మెంట్‌లను పాస్‌పోర్ట్ సేవా వెబ్‌సైట్‌లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో ఇదివరకే దరఖాస్తు చేసుకున్నవారు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

పీఆర్‌సీ బకాయిల సాధనకు డాక్టర్ల కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ బోధనా వైద్యుల పీఆర్సీ బకాయిల ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, దాని సాధనకు కార్యాచరణ చేపట్టాలని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల, కార్యదర్శి జలగం తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు గురువారం సంఘం కోర్ కమిటీ సమావేశం జూమ్ మీటింగ్ నిర్వహించారు. జూలై 9న సర్వసభ్య సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించనున్నట్లు వారు చెప్పారు.

ఎట్టకేలకు ఎంట్రీ

రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు



యాదాద్రి కొండకు దిగువన ఉన్న చెరువుగా మారిన సెంట్రల్ పార్కింగ్ స్థలంలో నీట మునిగిన కార్లు


సాక్షి, హైదరాబాద్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. బుధవారం నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా వ్యాప్తి చెందిన రుతుపవనాలు... గురువారం కల్లా తెలంగాణలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లా పరిసరాల వరకు వ్యాప్తి చెందిన రుతుపవనాలు.. రెండు, మూడు రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూన్ మొదటివారం కల్లా రాష్ట్ర మంతటా విస్తరించిన రుతుపవనాలు... ఈసారి రెండువారాలకు పైబడి ఆలస్యంగా రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సాధారణంగా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు కాలాన్ని నైరుతి సీజన్‌గా పరిగణిస్తారు. ఈ క్రమంలో జూన్ మొదటి వారంలో తొలకరి జల్లులతో ప్రారంభమై క్రమంగా మోస్తరు నుంచి భారీ, అతి భారీ వర్షాలు నమోదవుతాయి. సీజనల్ వర్షాలు వ్యవసాయానికి అత్యంత కీలకం. కానీ ఈసారి తొలకరి వర్షాలు ఆలస్యం కావడంతో రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ రానున్న కాలంలో ఎలాంటి వాతావరణం నెలకొంటుందో వేచి చూడాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తొలకరి వర్షాలు చూసి విత్తనాలు నాటకుండా కాస్త వేచిచూడడమే మంచిదని సూచిస్తున్నారు.

మొదలైన వానలు

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని పలు ప్రాంతాలపై గురువారం రుతుపవనాల ప్రభావం ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. ప్రస్తుతానికైతే రుతుపవనాలు చురుకుగా ముందుకు కదులుతున్నాయి. ఇదే వేగాన్ని కొనసాగిస్తే రానున్న మూడురోజుల్లో రాష్ట్రమంతటా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నట్లు నిపుణులు సూచిస్తున్నారు. జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా నమోదు కావాల్సిన సాధారణ వర్షపాతం 12.93 సెంటీమీటర్లు. కాగా జూన్ 22 నాటికి 9.15 సెంటీమీటర్ల సాధారణ వర్షం కురవాలి. కానీ రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వర్షాలు అరకొరగా మాత్రమే పడటంతో ఈనెల 22 నాటికి కేవలం 2.31 సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. సాధారణంగా నమోదు కావాల్సిన వర్షపాతంలో 75 శాతం లోటు ఉన్నట్లు స్పష్టమవుతోంది. కాగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 0.5 సెంటీమీటర్ల (5 మిల్లీమీటర్లు) సగటు వర్షపాతం నమోదైంది. వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, జనగామ, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, గద్వాల, నల్లగొండ జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కాగా యాదగిరిగుట్ట పట్టణంతో పాటు యాదాద్రి కొండపై గురువారం భారీ వర్షం కురిసింది. కొండపై భక్తులు తలదాచుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. కొండ కింద గల సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాలు నీట మునిగిపోయాయి.

ఉపరితల ఆవర్తనం.. పశ్చిమ దిశ నుంచి గాలులు

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలు, ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో సగటు సముద్ర మట్టం నుంచి 3.1 – 5.8 కిలోమీటర్ల వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు నమోదు కానున్నాయి. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి రాష్ట్రానికి బలంగా గాలులు వీస్తున్నాయని వివరించింది.



పిడుగుపాటుకు రైతు మృతి



ఇంద్రసేనారెడ్డి

శంషాబాద్ రూరల్: మండలంలోని ననాజీపూర్ గ్రామానికి చెందిన అయినాల ఇంద్రసేనారెడ్డి (46) గురువారం సాయంత్రం కౌలు భూమిలో బంతినారు వేస్తున్నాడు. ఇంతలో ఉరుములు, మెరుపులతో వాన ప్రారంభం కాగా అతనిపై పిడుగు పడింది. దీంతో స్పృహ తప్పిన ఇంద్రసేనారెడ్డిని స్థానికులు శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. అతనికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న తేజావత్ సుశీల

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నర్సుకు ఉత్తమ అవార్డు ప్రదానం చేసిన రాష్ట్రపతి
- 2022 సంవత్సరానికిగాను ఏఎన్‌ఎమ్ కేటగిరీలో పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన తేజావత్ సుశీల జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా నర్సులు చేస్తున్న ఉత్తమ సేవలకుగాను జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను ఏటా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నారు. గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 2022, 2023 సంవత్స రాలకుగాను జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందించారు. ఇందులో 2022కుగాను ఏఎన్‌ఎమ్ కేటగిరీలో తెలంగాణకు చెందిన నర్సు తేజావత్ సుశీల రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట సమీపంలో కనీసం రహదారి సదుపాయం కూడా లేని మారుమూల ప్రాంతంలో ఉండే గుత్తికోయలకు అందించిన సేవలకు గుర్తుగా నైటింగేల్ అవార్డును అందించినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. 1973 నుంచి ఈ ఏడాది వరకు మొత్తం 614 మంది నర్సులు ఉత్తమ నర్సులకు నైటింగేల్ అవార్డులు అందుకున్నారని కేంద్రం తెలిపింది.

డీఆర్‌డీఓ శాస్త్రవేత్తకు గోల్డెన్ పీకాక్ ఎకో ఇన్నోవేషన్ అవార్డు

భూమిలో కలిసిపోయే పాలిథిన్ కవర్లను తయారుచేసిన డాక్టర్ వీరబ్రహ్మం

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ హితమైన క్యారీ బ్యాగ్‌లు రూపొందించిన డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)కు చెందిన చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కె.వీరబ్రహ్మంకు గోల్డెన్ పీకాక్ ఎకో ఇన్నోవేషన్ అవార్డు–2023 పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం బెంగళూరులో నిర్వహించిన 'ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, క్లైమెటిక్ చేంజ్–2023'సదస్సులో భాగంగా కర్ణాటకకు చెందిన మాజీ న్యాయమూర్తి రితూరాజ్ అవస్థీ ఈ అవార్డును వీరబ్రహ్మంకు ప్రదానం చేశారు. సాధారణంగా మనం వినియోగిస్తున్న పాలిథిన్ క్యారీబ్యాగ్‌లు భూమిలో, నీటిలో కరగవు. అవి విచ్ఛిన్నం కావడానికి 300 నుంచి 500 ఏళ్ల సమయం పడుతుంది. దీని వల్ల భూమి మీద ప్లాస్టిక్ వ్యర్థాలు గాలి, నీటి కాలుష్యానికి కారణం అవుతున్నాయి. ప్లాస్టిక్ భూతాన్ని అంతమొందించేందుకు పాలిథిన్ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా 120 రోజుల్లో భూమిలో కలిసిపోయి ఎరువుగా మారే బయోడీగ్రేడబుల్ బ్యాగ్‌లను శాస్త్రవేత్త వీరబ్రహ్మం కనుగొన్నారు. మొక్కజొన్న గంజి, బయోపాలిమర్లను కలిపి దీన్ని ఆయన రూపొందించారు. ఈ బ్యాగ్‌లతో పర్యావరణానికి ముప్పు లేదు. ఈ టెక్నాలజీని డీఆర్‌డీఓ ఇప్పటికే 40 కంపెనీలకు ఉచితంగా అందించింది. వీరబ్రహ్మంకు గోల్డెన్ పీకాక్ అవార్డు దక్కడంపై శాస్త్రవేత్తలు, పర్యావరణ శ్రేయోభిలాషులు అభినందించారు.

అనుమతి లేకుండా అడ్మిషన్లు

- నోటీసులతో సరిపెట్టిన ప్రభుత్వం
- గురునానక్ విద్యార్థుల్లో ఆందోళన



గురునానక్ కళాశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్/ఇబ్రహీంపట్నం: ఎలాంటి అనుమతులు లేని గురునానక్ యూనివర్సిటీలో చేరిన విద్యార్థులు ఆర్థికంగానే కాకుండా, విద్యా సంవత్సరం నష్టపోయామని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇందుకు కారణమైన వర్సిటీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. కొత్తగా రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2022లో ఓ చట్ట సవరణ తెచ్చింది. గత ఏడాది సెప్టెంబర్ 13న ఈ బిల్లుకు అసెంబ్లీ కూడా ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఈ బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపారు. ఇప్పటివరకూ దీనిపై గవర్నర్ దగ్గర్నుంచి స్పష్టత రాలేదు. అయితే, గురునానక్‌తోపాటు మరో కాలేజీ కూడా బిల్లుపై స్పష్టత రాకుండానే విద్యార్థులను చేర్చుకుంది. వారి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసింది. గురునానక్ కాలేజీలో 3వేల మంది విద్యార్థులు చేరారు. 2022–23 విద్యా సంవత్సరం ముగిసినప్పటికీ అనుమతులు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. దీనిపై ప్రభుత్వం సంబంధిత కాలేజీలకు నోటీసులివ్వగా, విద్యార్థుల వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తామని యాజమాన్యాలు చెబుతున్నాయి. అయితే ఈ చర్యతో తమకు జరిగిన నష్టం భర్తీ కాదని విద్యార్థులు అంటున్నారు. తమకు అన్యాయం చేశారంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఆందోళన కారులు కళాశాలలోకి చొరబడి రాళ్లు, కర్రలతో విధ్వంసం సృష్టించారు. దీంతో పోలీసులు లాఠీలు ఝళిపించి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

ఆయన తీర్పులు మార్గనిర్దేశకాలు

- జస్టిస్ రామసుబ్రమణియన్ తీర్పులపై హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణియన్ తీర్పులు ఇతర న్యాయమూర్తులకు మార్గనిర్దేశం చేస్తాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టును దశాబ్దాలుగా పీడిస్తున్న నిజాం కాలంనాటి భూతగాదాల పరిష్కారానికి జస్టిస్ రామసుబ్రమణియన్ తీసుకున్న నిర్దిష్ట చర్యల గురించి అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ గుర్తుచేయగా.. అటువంటి పెండింగ్ వివాదాలన్నింటినీ (ఇ –14 తదితర పిటిషన్లుగా పిలుస్తారు) పరిష్కరిస్తానని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వెల్లడించారు. హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో గురువారం హైకోర్టు ఆవరణలో జస్టిస్ రామసుబ్రమణియన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సీజే హాజరై మాట్లాడారు. చూసేందుకు చాలా సింపుల్‌గా కనిపించినా, అత్యంత తెలివైన వ్యక్తి జస్టిస్ రామసుబ్రమణియన్ అని బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి కొనియాడారు. జస్టిస్ రామసుబ్రమణియన్ మాట్లాడుతూ 2016లో మద్రాస్ హైకోర్టు నుంచి బదిలీపై హైదరాబాద్ హైకోర్టుకు న్యాయమూర్తిగా వచ్చానని.. నాటి నుంచి న్యాయమూర్తులు, న్యాయవాదులు తనపై చూపుతున్న అభిమానం అపారమైనదన్నారు. దీనికిగాను వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ పి.నవీన్‌రావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు, అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ రామసుబ్రమణియన్ దంపతులను సన్మానిస్తున్న సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తదితరులు

ఫ్లయింగ్ ఆఫీసర్ ఉద్యోగం రావడం గర్వకారణం



వనపర్తి టౌన్: తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచి ఫ్లయింగ్ ఆఫీసర్ కావాలనే కలను పట్టుదలతో నిఖిల్ సాయి సాధించాడని, రాష్ట్రం నుంచి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఒక్కడే ఉండటం గర్వకారమని పలువురు అభినందించారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నిఖిల్‌సాయిని గౌరైల కాపర్ల సంఘం అధ్యక్షుడు కురుమూర్తి, ఉపాధ్యక్షుడు కందూరు చంద్ర యాదవ్ గురువారం జిల్లా కేంద్రంలో పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, నాయకులు నాగేంద్రం యాదవ్, తిరుమల్ యాదవ్, పెండెం శ్రీనివాస్ యాదవ్, నాగరాజు యాదవ్, దేశి, రాంచందర్ యాదవ్, నాగశేషు యాదవ్ పాల్గొన్నారు.

రైతుల రుణాలను మాఫీ చేయాలి

నారాయణపేట: వానాకాలం సీజన్‌లో రైతాంగ సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించి, రైతు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను ఇవ్వాలని ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి ఏఓ నర్సింగ్‌రావు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వానాకాలం సాగు 1.5 కోట్ల ఎకరాల్లో సాగు చేస్తున్నారని, ఇందులో ప్రధానంగా పత్తి 75 లక్షల ఎకరాల్లో, వరి 60 లక్షల ఎకరాల్లో ఉంటుందన్నారు. పత్తి విత్తనాలు 1.5 కోట్ల ప్యాకెట్లు అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసిందని, ఇప్పటికే అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వం డాంబికాలు పలుకుతుందన్నారు. రైతు ప్రభుత్వమని చెబుతున్న సీఎం కేసీఆర్ 2019 లోనే సాగు సబ్సిడీలు ఎత్తివేసిందన్నారు. పచ్చి రొట్ట విత్తనాలను ఉచితంగా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో రుణాలివ్వాలని పరిస్థితుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీతో అందించని పరిస్థితుల్లో దళారులు, వ్యాపారులే గ్రామాల్లో నకిలీవి అధిక ధరలకు అంటకట్టడమే గాక వడ్డీలతో సహా పంటలు వారికే అప్పగించే ఒప్పందాలు చేసుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధరలు నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో యాదగిరి, కాశీనాథ్, సలీం, ప్రశాంత్, నరసింహులు, చెన్నారెడ్డి, నారాయణ, రాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పీయూ వీసీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

డిగ్రీ, బీఈడీ కళాశాలల్లో వసతులు లేకున్నా అనుమతులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో అక్రమాలకు పాల్పడుతున్న వైస్‌ఛాన్స్‌లర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి జిల్లాలోని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పీయూలో నిబంధనలకు విరుద్ధంగా పలువురిని ఉద్యోగాల్లో నియమించారని, నోటిఫికేషన్లు లేకుండా ఎలా భర్తీ చేస్తారని ప్రశ్నించారు. బినామీల పేరుమీద టెండర్లు వేసి పరోక్షంగా వీసీ వాటిని నిర్వహిస్తున్నారని, పీయూలో పనిచేస్తున్న అధ్యాపకురాలి భర్తకు టెండర్లు ఇచ్చారన్నారు. వీసీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎస్‌బీఐ బ్యాంక్‌లో నుంచి రూ.14 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను డ్రా చేశారని, వాటిపై స్పష్టత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వసతులు లేవని ఫిర్యాదు..

డిగ్రీ, బీఈడీ కళాశాలల్లో వసతులు లేవని ఫిర్యాదులు ఇచ్చినా.. స్పందించడం లేదని ఆరోపించారు. కళాశాలల నుంచి మామూళ్లు వసూలు చేసి వాటికి అనుమతులు ఇస్తున్నారని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల కిందట నాన్‌టీచింగ్ సిబ్బందికి వేతనాల పెంపుపై ఈసీలో అనుమతి తీసుకుని 2 సంవత్సరాలు వేతనాలు ఇచ్చాక, తర్వాత వాటిని నిలిపివేయడం వీసీ అనాలోచిత నిర్ణయాలకు పరాకాష్ట అన్నారు. సిబ్బందికి వేతనాల పెంపులో భారీ అవకతవకలు జరిగాయని, రాష్ట్ర స్థాయి కమిటీతో యూనిర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లైబ్రేరీలో రూ.10 లక్షల విలువ చేసే పుస్తకాలు మాయమయ్యాయని, పలు మార్లు విచారణ జరిపినా.. ఇప్పటి వరకు ఎటువంటి వివరాలు బయటికి వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు రూప్‌సింగ్, సంతోష్, భరత్ పాల్గొన్నారు.

తెలంగాణ సాహిత్య సభల్లో జిల్లా కవులు



పాలమూరు కవయిత్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో భారత జాగృతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తెలంగాణ సాహిత్య సభల్లో జిల్లాకు చెందిన పలువురు కవులు, కవయిత్రులు పాల్గొన్నారు. తెలంగాణ మహిళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, బండారు సునీత, డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత జాగృతి అధ్యక్షురాలు కవిత జిల్లా కవులు, రచయిత్రులను సన్మానించారు. అదే విధంగా జిల్లాకు చెందిన ప్రముఖ కవి కె.లక్ష్మణ్‌గౌడ్ సాహిత్య సభల్లో పాల్గొని వేగుచుక్క కవితా సంపుటిని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు అందజేశారు.

పత్రసమర్పణ చేసిన డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్.

భారత జాగృతి నిర్వహించిన తెలంగాణ సాహిత్య సభల్లో జిల్లాకు చెందిన పరిశోధకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పత్రసమర్పణ చేశారు. 'తెలంగాణ నవలా సాహిత్యం' అనే అంశంపై పత్రసమర్పణ చేశారు. తెలంగాణ నవల ఆవిర్భావ, వికాసాల గురించి తెలియజేశారు. అనంతరం జాగృతి అధ్యక్షురాలు కవిత జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రాలతో భీంపల్లి శ్రీకాంత్‌ను సత్కరించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరిశంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది

- జాతీయ రహదారి నిర్మాణంలో రాష్ట్ర ఫైనల్ లేవు
- మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పాలమూరు: జడ్చర్ల నుంచి రాయచూర్ వరకు రోడ్డు వేసేందుకు ఎక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు పెట్టలేదని, కేంద్ర నిధులతోనే ఆ రోడ్డు వేశారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొమ్ము ఒకడిది.. సోకు మరొకరిది అనే విధంగా బీఆర్‌ఎస్ పాలకులు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం ఏం చేసిందో ఇంటింటికీ తిరిగి ప్రజలకు తెలియజేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్‌వోఆర్‌పై కేసీఆర్‌కు వచ్చే సంపాదనకు లిక్కర్, రవాణా, రిజిస్ట్రేషన్, సేల్స్ ట్యాక్స్, వ్యాట్‌పై వచ్చే డబ్బులు మొత్తం కలిపినా ఉద్యోగులకు ఇచ్చే జీతాలకు, పింఛన్లకు సరిపోవడం లేదన్నారు. రాష్ట్రంలో చేసే అభివృద్ధి పనులకు కేంద్రం నుంచే వచ్చే నిధులేనని తెలిపారు. కేసీఆర్ దగ్గర డబ్బులు ఉంటే ప్రభుత్వ ఉద్యోగులకు 15వ తేదీ నాడు ఎందుకు జీతాలు ఇస్తున్నాడని, ఈ ప్రభుత్వం అప్పు చేసి పప్పుకూడు ధోరణిలో ఉందన్నారు. అప్పన్నపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తయినట్లు అధికారికంగా కాంట్రాక్టర్ అధికారులకు అప్పగించలేదన్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే కేంద్ర మంత్రితో ప్రారంభం చేసే దిశగా ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం 9ఏళ్ల కాలంలో చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలపై గురువారం జిల్లా కేంద్రంలోని పాన్ చౌరస్తా, రామ్ మందిర్ చౌరస్తా, పాత గ్రంథాలయంలో ఏరియాలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, పద్మజారెడ్డి, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు విడుదల

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,017 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎలాంటి ఇన్‌ఫ్లో లేకపోవడంతో రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటిని విడుదల చేయడం లేదు. కేవలం తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

ముమ్మరంగా మొక్కజొన్న కొనుగోళ్లు




సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

తాడూరు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోళ్లు ముమ్మరం చేశామని మార్కెటింగ్ శాఖ మేనేజర్ నర్సింగ్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 6 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 1,717 మంది రైతుల నుంచి 95.89 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేశామన్నారు. ఇందుకుగాను రూ.18.81 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఇందులో అత్యధికంగా తాడూరు మండలంలోని 546 రైతుల నుంచి 36 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసి రూ.6.48 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. 6 కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేసి రైతులకు ఎప్పటికప్పుడు డబ్బులు వారి వారి ఖాతాలలో జమ చేయడంతోపాటు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ సమ్మద్ పాష, సీఈఓ ఆంజనేయులు, రైతులు బాలవెంకటయ్య, రమేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేయాలి

- ఆర్టీసీ సంస్థను లాభాల్లోకి తెచ్చేందుకు కృషి చేయండి
- పయాణికులతో మర్యాదగా వ్యవహరించండి
- ఆదర్శ ఉద్యోగులకు సన్మానం



ఆదర్శ ఉద్యోగులను సన్మానించిన ఈడీ పురుషోత్తం, ఆర్‌ఎం

నారాయణపేట రూరల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేయాలని హైదరాబాద్ జోన్ ఈడీ ఏ.పురుషోత్తం అన్నారు. రెండోరోజు గురువారం నారాయణపేట డిపోలో పర్యటించారు. ఆయనతో వచ్చిన నాలుగు బృందాలు వివిధ విభాగాల్లోని రికార్డులను తనిఖీ చేశారు. గ్యారేజీలో కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. బస్సుల షెడ్యూల్, ఈపీకే, ఓఆర్‌లను పరిశీలించి, తగు సూచనలు చేశారు. శ్రీశైలం, యాదగిరిగుట్ట బస్సుల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టాలని, రాత్రివేళ 11.30గంటలకు హైదరాబాద్‌కు బస్సు ఏర్పాటుపై నివేదిక సిద్ధం చేయాలని చెప్పారు. కొత్తగా వచ్చిన సూపర్ లగ్జరీకి తగిన ఈపీకే రాకపోవడంతో, డీలక్స్ సర్వీసులను హైదరాబాద్ మీదుగా దూరప్రాంతాలకు నడిపించే ఆలోచన చేస్తామని చెప్పారు. బస్సులు నిలిచిపోకుండా తగినంతగా డ్రైవర్ల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. మధ్యాహ్నం తర్వాత హైదరాబాద్‌కు బస్సుల కొరత లేకుండా మార్పులు చేయించాలని సూచించారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందన..

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, టార్గెట్‌కు మించిన ఆదాయం తెచ్చిన కండక్టర్లు, డీజిల్ మైలేజ్ తీసుకువచ్చిన డ్రైవర్లను డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ బస్సులు సమయపాలన పాటించేలా రన్నింగ్ సెక్షన్ అధికారులు పర్యవేక్షించాలని, కండీషన్ విషయంలో నిర్లక్ష్యం లేకుండా గ్యారేజ్ సిబ్బంది సరిచూడాలని చెప్పారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. సంస్థను లాభాల్లోకి తేవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీదేవి, డిప్యూటీ ఆర్‌ఎం శ్యామల, డీఎం ఆంజనేయులు, ఎంఎఫ్ రాజశేఖర్, ఎస్‌టీఐ నజీర్‌షేక్, కార్యాలయ సూపరింటెండెంట్ నరేందర్, సీఆర్‌సీ ఆంజనేయులు, ఏడీసీలు ఉన్నారు.